

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**గండీడ్, ఆగస్టు 16 ప్రభాతవార్త :** ఎస్పీ కె. నరసింహ మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరిని కరచాలనం చేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ అక్కడ మెంటైన్ చేస్తున్న రిజిస్టర్‌లు, సిడి ఫైళ్లని చెక్‌చేసి, అధికారులకు పలు సూచనలు చేస్తూ ప్రతిరోజు పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, పోలీస్ స్టేషన్‌లోని వర్టికల్స్ నిర్వహణ, హెచ్‌ఆర్‌ఎంఎస్ ఆన్‌లైన్ వినియోగించు విధానం, టిఎస్ కాప్స్ ఆన్‌లైన్‌లో కేసుల వివరాలు నమోదు చేసే మొదలగు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు వారిని తనిఖీ చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ గురించి వివరించి వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటరమణరెడ్డి, ఎస్పీ సిసి రాంరెడ్డి, రూరల్ ఇన్స్‌పెక్టర్ స్వామి, ఎస్సై సురేష్, ఐటిసెల్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఫైళ్లను తనిఖీ చేస్తున్న ఎస్పీ

## సీఎం కెసిఆర్ పాలన పేద ప్రజలకు శ్రీరామరక్ష..

**బిఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భారీగా చేరికలు**

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే**

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండల పరిధిలోని మిట్టదొడ్డి గ్రామానికి చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీని విడిచి నేడు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కెసిఆర్ నాయకత్వాన్ని బలపరచుటకు బిఆర్‌ఎస్ పార్టీలోకి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో లక్ష్మన్న, ఆరోవార్డు మెంబర్ నర్సింహులు, పార్వతమ్మ, సరస్వతి, మహేశ్వరి, గంగమ్మ, అంజనమ్మ, పార్వతమ్మ, మాల చిన్న నర్సింహులు, బసవరాజ్, తారక్, తిమ్మారెడ్డి, రంగముని, నవీన్, లక్ష్మన్న, ఆంజనేయులు, నరెందర్, అంజి, రంజిత్, భీమేష్, హనుమంతు, ఉపేంద్ర, రమేష్, రంగన్న, మల్లేష్, సిద్ధన్న, భీమయ్య, వెంకటేష్, మహేష్, నితిన్, కిట్టు సోమేశ్వర్‌రెడ్డి, ఉరుకుంద, వీరేష్, నర్సింహులు, విజయ్ వీరితో పాటు 50 మందికి పైగా కాంగ్రెస్, బిజెపి పార్టీలను విడిచి బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిని ప్రతి ఒక్కరిని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపిపి విజయ్‌కుమార్, సర్పంచ్ షెక్షిక్, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు శివరామిరెడ్డి, గద్వాల తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

## గొల్ల, కురువలు అభివృద్ధి చెందాలి..

**రెండ విడత గొర్రెల పంపిణీ చేసిన ఎమ్మెల్యే చిట్టెం**



రెండవ విడత గొర్రెల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్, ఆగస్టు 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అన్ని కులాల వారితోపాటు గొల్ల కురుమలు అభివృద్ధి చెందాలని ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటుగా కెసిఆర్ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిందని అర్హత కలిగిన వారందరికి ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అంతకుముందు ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. బుధవారం మక్తల్ మండలంలోని ముస్లాయిపల్లి గ్రామంలో గొల్ల, కురుమలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గొల్ల, కురువలకు 24 యూనిట్ల సబ్సిడి గొర్రెలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాన గాలిని లెక్కచేయకుండా గొర్రెల పెంపకాన్ని అడవిలో ఉంటారని వారిని అన్ని వర్గాల వారికి అన్ని విధాలా సహాయ సహకారం అందిస్తే అన్ని వర్గాల వారితో పాటు వారు కూడా అభివృద్ధి చేస్తారని భావించిన కెసిఆర్ గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పనులు వేగవంతం చేయాలి:కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 16 ప్రభాతవార్త :** ఆయా ప్రభుత్వ ప్రాధామ్య పథకాల అమలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. బుధవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద సంపద వనాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, సంపద వనాలతో పాటు, రహదారుల కిరువైపులా అలాగే అన్నిచోట్ల నాటే మొక్కలను వారం చివరి నాటికి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల కింద దరఖాస్తు చేసుకున్న వారికి త్వరగా ఉత్తర్వులు ఇచ్చే విధంగా చూడాలని ఇందుకుగాను అవసరమైన ఖాళీల వివరాలు, ఇతర వివరాలు అన్నింటిని సేకరించాలన్నారు. ఉద్యోగులకు సంబంధించి మెడికల్ రియాంబర్స్‌మెంట్, ఇంక్రిమెంట్ తదితర అన్నింటిని ఎప్పటికి అప్పుడే మంజూరు చేయాలని అన్నారు. ఓటరు అవగాహనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న ఐ ఓట్ ఫర్ ష్యూర్ అన్న అంశంపై 5కె రన్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాసంస్థలు, స్వయం సహాయక మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ఎంసిసి ఉద్యోగులు అందరు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల పంపిణీలో భాగంగా యూనిట్లర్ గ్రౌండింగ్ వేగవంతం చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలను వేగవతం చేయాలన్నారు. బిఎల్‌ఓ ఖాళీలు ఉన్నచోట భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు ఏర్పాటు చేయాలని, వెబ్ కాస్టింగ్ కోసం లైట్లు, ఇతర సౌకర్యాలను చూడాలని చెప్పారు. ఉద్యాన తోటల పెంపకంలో భాగంగా ఉపాధి హామీకింద గుంతల తవ్వకం తదితర పనులను వెంటనే పూర్తిచేయాలని అన్నారు. ఈ ఆఫీస్ కింద పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిష్కరించాలని, దళితబంధు తదితర పథకాల కింద యూనిట్ల గ్రౌండింగ్‌లో భాగంగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16 నుండి 31 వరకు జాతీయ కుష్టు నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని, ఈ కార్యక్రమంలో భాగంగా ఎవరికైనా చర్మంపై పాలిపోయిన లేక రాగి రంగుస్పర్శ జ్ఞానంలేని మచ్చలు ఉన్నట్లయితే కాళ్లు, చేతులు నరాలలో వాపు, నొప్పి, బలహీనత, తిమ్మిరి, ముఖంపై, చెవి, బయట నూనె పూసినట్లు చర్మం మెరుస్తున్న, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోవడం ముఖం, కాళ్లు చేతులపై నొప్పిలేని బుడిపలు వంటి వాటి పట్ల ముందే అప్రమత్తమై డాక్టర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్‌డిఓ యాదయ్య, డిఆర్‌ఓ కెవివి రవికుమార్, జిల్లా అధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

## మండలంలో పర్యటించనున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

**కోయిల్‌కొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త :** మండలంలో నేడు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డిలు పర్యటించనున్నారని మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా మణికొండ గ్రామంలో రూపాయలు 22 లక్షలతో కార్మిక భవనానికి భూమి పూజచేసిన అనంతరం మండలంలోని లింగాల్చేడు గ్రామంలో గల చెక్‌డ్యాం ప్రారంభోత్సవం, మోదీపూర్ గ్రామంలోని చెక్‌డ్యాం ప్రారంభోత్సవాన్ని జిల్లా మంత్రివర్యులు వి. శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డిలు ప్రారంభిస్తారని వారు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలన్నారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

# క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి..



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి




మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి ,



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

- అంతర్ జిల్లా ఫుట్ బాల్ టోర్నమెంట్‌ను జిల్లాలో నిర్వహించడం అభినందనీయం
- గెలుపు ఓటములు సహజం, గెలిచిన వారు ఓడిన వాళ్లను వారు పోరాడిన తీరును మెచ్చుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- క్రమశిక్షణతో ఆటలు ఆడితే నైపుణ్యం, సామార్థ్యం పెరుగుతుంది
- క్రీడాకారులు ఆటలు ఆడేటప్పుడు వారి మొహంలో ఒక చైతన్యం, ఉత్తేజం ఉంటుంది
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి టౌన్ ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఫుట్ బాల్ అసోసియేషన్ ద్వారా అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను వనపర్తి జిల్లాలో నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆగస్టు 16 నుండి 18 వరకు పెబ్బేరు మండలంలోని పిజెపి క్రీడా మైదానంలో అంతర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించగా బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి క్రీడలను ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ప్రతి క్రీడాకారునిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, సాటి క్రీడాకారునిలో ఉన్న ప్రతిభను గుర్తించి వారితో పోటీపడి ప్రతిభను నేర్చుకోవాలి తప్ప తక్కువ చేసి చూడవద్దని దీనినే క్రీడా స్ఫూర్తి అంటారని వివరించారు. వనపర్తి జిల్లా చాలా ప్రత్యేకత కలిగిందని, రాష్ట్ర జాతీయస్థాయి క్రీడాకారులను అందించిన జిల్లా వనపర్తి అని తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రత్యేకతలను తెలుసుకోవాలని, జూరాల, రంగాపూర్, బీచుపల్లి వంటి ప్రాంతాలను సందర్శించాలని తెలిపారు. ఈ ప్రాంతం చిరకాలంగా మీ మదిలో గుర్తుండిపోవాలని చెప్పారు. ఆటల ద్వారా తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. గెలుపు ఓటములు సహజమని, గెలిచిన వారు ఓడిన వాళ్లను వారు పోరాడిన తీరును మెచ్చుకోవాలని సూచించారు. మరడోన, మెస్సీ, రోనాల్డో వంటి అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో క్రీడా సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తున్నందుకు ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. క్రమశిక్షణతో ఆటలు ఆడితే నైపుణ్యం, సామార్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఏ ప్రాంతంలో వెళ్లి టోర్నమెంట్‌లో పాల్గొన్నా కొన్ని జ్ఞాపకాలు ఉండిపోతాయని , వనపర్తి జిల్లా నుండి అందరూ తీపి జ్ఞాపకాలతో వెళ్లాలని ఆకాంక్షించారు. ఇక్కడి వంటకాలు చాలా బాగుంటాయని అదే విధంగా చూడాల్సిన ప్రాంతాలు సైతం ఉన్నాయని తెలిపారు. క్రీడాకారులు ఆటలు ఆడేటప్పుడు వారి మొహంలో ఒక చైతన్యం, ఉత్తేజం ఉంటుందని అది జీవితంలో ఒక చుక్కాని వలె పని చేస్తుందని తెలిపారు. భారతదేశంలో సైతం పేరు గాంచిన గొప్ప ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారని అందులో సునీల్ ఛత్రి ఒకరని తెలిపారు. అతన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కరుణశ్రీ , మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు, వైస్ ఛైర్మన్ కర్రెస్వామి, జిల్లా క్రీడా శాఖల అధికారి సుధీర్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## 18-19 వయస్సు కలిగిన వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి..

**-వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ చీఫ్ ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసే విధంగా గ్రామ, వార్డు స్థాయిలో ప్రచారం చేయించాలని జాయింట్ చీఫ్ ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, స్వీప్ నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18-19 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా స్వీప్ యాక్టివిటీ ద్వారా మండల, గ్రామ స్థాయిలో ప్రచారం చేయించాలని సూచించారు. అదే విధంగా దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా చూడాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఇంటింటికి వెళ్లి 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైన ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోలేని వారు ఉన్నారా అనేది తెలుసుకునే విధంగా చూడాలన్నారు. కళాశాలలో ఓటరు నమోదుపై ప్రచారం చేయాలన్నారు. పిల్లలకు ఎన్నికలపై అవగాహన కల్పించే విధంగా ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదుకై వచ్చిన ధరఖాస్తు లను ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో స్వీప్ యాక్టివిటీ పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కే. సీతారామారావు, డీఈఓ గోవిందరాజులు, స్వీప్ నోడల్ అధికారి రాంమోహన్, సెక్షన్ సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## జడ్చర్లలో రెండు ఇండ్లల్లో చోరీ..

**- నగదు, బంగారం, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన దుండగులు**



బీరువా పగులగొట్టి వస్తులువు, బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు16, ప్రభాతవార్త:** జడ్చర్లలో దొంగలు హల్‌చల్ చేశారు. మూడు ఇండ్లల్లో బంగారం, వెండి, ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల మున్సిపాలిటీని 25వ వార్డులోని రాజీవ్‌నగర్ కాలనీలో ఆలూరు గ్రామానికి చెందిన నిరంజన్‌గౌడ్ అద్దెకు నివసిస్తున్నారు. అదే ఇంటి పక్కన గుడ్ల నర్వ గ్రామానికి చెందిన శివకుమార్ అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. కాగా నిరంజన్‌గౌడ్ మంగళవారం తమ బంధువుల దినకర్మకు వెళ్లగా శివకుమార్ తమ వ్యాపారం నిమిత్తం ఊరుకు వెళ్లారు. ఇరువురు రాత్రి పదిన్నర ప్రాంతంలో ఇంటికి చేరుకోగా ఇండ్ల తాళాలు పగులగొట్టి ఉండడంతో ఆందోళనలకు గురయ్యారు. నిరంజన్‌గౌడ్ తన ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉన్న దృశ్యాలను చూశారు. మూడు తులాల బంగారు ఆభరణాలు, 35తులాల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. శివకుమార్ ఇంట్లో సెల్ఫ్‌లో పెట్టిన తులంన్నర బంగారు బ్రాస్లెట్ 60 తులాల వెండి కాయిన్స్, రూ.50వేల విలువైన ల్యాప్‌టాప్, మూడు సెల ఫోన్లు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇదే ఇంటి పక్కల తాళాలు పగులగొట్టిఉండగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి చోరీ జరగలేదు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బుధవారం ఉదయం మహబూబ్‌నగ్ నుంచి క్లూస్ టీం రప్పించి నిందితుల వేలిముద్రలను సేకరించారు. విలువైన ఆభరాణాలు ఇంట్లో ఉంచకూడదని, ఊరికి బయటకు వెళ్లాలనుకుంటే బంగారం, నగదు వెంట తీసుకెళ్లాలని సీఐ సూచించారు.

## టిఆర్‌ఎస్ హామీలు ఏమయ్యాయి..

**పాత పాలమూరు అభివృద్ధి ఎక్కడ బస్తీ బాటలో బిజెపి నాయకులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 16 ప్రభాతవార్త :** బిఆర్‌ఎస్ నేతలు పాలమూరు అభివృద్ధి చెందిందని పదేపదే అంటున్నారని పాత పాలమూరు చూసి ఆమాట చెప్పాలని, అక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదని బిజెపి నేతలు ఆరోపించారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపి జితెందర్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మచారి, మాజీ మంత్రి పి. చంద్రశేఖర్ స్థానిక నాయకులతో కలిసి పాత పాలమూరులోని దళిత వాడలో పర్యటించారు. ప్రభుత్వ పథకాలను అందని వారిని విచారించారు. గతంలో బిఆర్‌ఎస్ నేతలు పాత పాలమూరులో ఇల్లులేని పేదలకు డబుల్ బెడ్‌రూం, దళిత బంధు పథకం అమలు కాలేదని ఆరోపించారు. ఎవరికి కూడా పింఛన్లు కూడా అందడం లేదని, కొత్త రేషన్ కార్డు ఇప్పటివరకు కూడా ఇవ్వలేదని దళితులకు ఆ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించినట్లు ఉందన్నారు. అక్కడ ఉన్న స్థానిక టిఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్కరికి రెండు, మూడు డబుల్ బెడరూం ఇల్లు కేటాయించారన్న విషయాన్ని చెప్పారు. రోడ్లుగాని డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగ్గా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో కనీసం దళితులను ఆదుకోవాలని కోరారు. బస్తీబాటలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాకుల బాలరాజు, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, రాష్ట్ర సభ్యుడు ఎడ్ల కృష్ణయ్య, దళితమోర్చా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా కోశాధికారి పాండవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, పడాకుల సత్యం, యువజనమోర్చా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఓబిసి మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



బస్తీ బాటలో జితెందర్‌రెడ్డి, వీరబ్రహ్మచారి నేతలు

# మండల సమావేశానికి హాజరు కాని అధికారుల పట్ల సభ్యుల ఆగ్రహం..

**ఇద్దరు పశువైద్యాధికారులు రాకపోవడంతో సర్పంచ్‌ల ఆందోళన**

**కరువు మండలంగా ప్రకటించాలని ఏకరువు పెట్టిన ఉప్పునుంతల సర్పంచ్**

**మండల సర్వసభ్య సమావేశంలో...**

**ఉప్పునుంతల, ఆగస్టు 16 ప్రభాతవార్త :** మూడు నెలలకు ఒక్కసారి మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని, ముఖ్యంగా వెల్టూరు పశువైద్యాధికారిణి ఒక్కరోజు ఆసుపత్రికి రాకపోతే ఎట్లా అని, మండల కేంద్రంలో ఉన్న పశువైద్యాధికారి హాజరు కాకుండా అసిస్టెంట్‌ను పంపిస్తే సరిపోతుందా, మండల సర్వసభ్య సమావేశం పెట్టింది ఎందుకోసమని మా బాధలు ఎవరికి చెప్పుకోవాలని పిరట్వాన్‌పల్లి సర్పంచ్ తాడూరు శివుడు సమావేశంలో ప్రశ్నించారు. బుధవారం ఎంపిపి అరుణా నర్సింహారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిపి అరుణా నర్సింహారెడ్డి మాట్లాడుతూ సమన్వయంతో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో గాలికుంటు వ్యాధులు సోకి లేగదూడలు మృత్యువాత పడుతున్నాయని తమగోడు ఎవరికి చెప్పుకోవాలని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి పశువైద్యాధికారులు హాజరు కాకుండా అసిస్టెంట్లను పంపిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. అసిస్టెంట్ సమావేశంలో మాట్లాడకుండా సభ్యులు అడ్డుకున్నారు. ఇంత ఇబ్బందికరంగా ఉంటే జిల్లా అధికారులను పంపిస్తే మా బాధలు వారికి వివరించుకుంటామని సభ్యులు సూచించారు. ఇకనుంచి సమావేశాలకు బాధ్యత గల అధికారులు రాకుండా ఉంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సంవత్సరం ఆశించిన వర్షాలు లేక రైతులు సాగు చేసుకున్న పంటలు ఎండిపోయి దుర్భర పరిస్థితిలో రైతులు ఉన్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి కరువు మండలంగా ప్రకటించాలని ఉప్పునుంతల సర్పంచ్ కట్ట సరితానంతరెడ్డి, కాల్వ పుష్పగోవర్ధన్‌రెడ్డి, వెల్టూరు ఎంపిటిసి రెడ్డి రెడ్డి రంగారెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పనులు గ్రామాల్లో చేసిన బిల్లులు రాకపోతే ఎట్లా అని లక్ష్మాపూర్, ఈరట్వానిపల్లి సర్పంచ్‌లు కాల్వ పుష్పగోవర్ధన్‌రెడ్డి, లింగమయ్య యాదవ్‌లు ప్రశ్నించారు. గ్రామాల్లో ఎలాంటి సమావేశాలు జరిగిన ప్రజా ప్రతినిధులను విస్మరిస్తున్నారని, మహిళా సమాఖ్య సమావేశం జరిగినప్పుడు కనీసం సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ సరితానంతరెడ్డి, ఐకెపి ఎపిఎంను ప్రశ్నించారు. గ్రామాల్లో మూడు నెలల క్రితం చనిపోయిన వారి కుటుంబాలకు పింఛన్ వస్తుంది. 3 సంవత్సరాల క్రితం భర్త చనిపోయిన వితంతువులకు పెన్షన్ రావడం లేదని వెంటనే అర్హులైన వారికి పెన్షన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సరితానంతరెడ్డి సమావేశంలో అధికారులకు ఏకరువు పెట్టారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని సభ్యులు సమావేశంలో సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఇటీవల గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను గ్రామాల వారిగా పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడం జరుగుతుందని, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తదుపరి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఎంపిడిఓ వివరించారు. అంతకు ముందు అన్ని శాఖల ప్రగతి నివేదికపై సమీక్షలు నిర్వహించారు. సమస్యలు, పరిష్కార మార్గాలపై సభ్యులు, అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో ఎంపిపి అరుణా నర్సింహారెడ్డి, ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు, ఎంఈఓ రామారావు, ఎంపిఓ నారాయణ, వైద్యాధికారిణి స్వప్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మిరియాల అమృత కర్ణయ్య, బిపాసా, ఎఓ సునిత, విద్యుత్ ఎఇ అమర్‌సింగ్, పిఆర్ ఎఇ సందీప్‌రెడ్డి, మిషన్ భగీరథ ఎఇ సాయికృష్ణ, పశువైద్యశాఖ అసిస్టెంట్ కమల, మండల కో ఆప్షన్ మెంబర్ బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బాలునాయక్, ఈజీఎస్ ఎపిఓ సుదర్శన్‌గౌడ్, ఎపిఎం సైదులు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, ఫార్మాసిస్టు శ్రీనివాసులు, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అరుణా నర్సింహారెడ్డి



సమావేశానికి హాజరైన అధికారులు

## ఆడపడుచులకు అండగా కెసిఆర్ ప్రభుత్వం..

**147 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**ఇటిక్యాల,ఆగస్టు 16 ప్రభాతవార్త :** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో ఆడపడుచులకు అండగా నిలుస్తూ పెద్దన్నలా ఆదుకుంటూ పేదింటి మహిళలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద వివాహం అయిన కుటుంబంలో ఆ మహిళకు 1 లక్ష 116 రూపాయలు తెలంగాణ ప్రభుత్వం అందించి ఆదుకుంటుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. బుధవారం మండల పరిధిలోని గ్రామాలలో 78 మంది మహిళ లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం హాజరై మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆడబిడ్డల వివాహాలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలుచేసి ఆదుకుంటున్నారని గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి పథకం లేదని అలాగే దేశంలో ఏ రాష్ట్రంలోకూడా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అమలు చేయడం లేదన్నారు.వడ్డేపల్లి మండలంలో 36 మందికి, ఉండవల్లి మండలంలో 33 మంది మహిళ లబ్దిదారులకు మొత్తం 147 మందికి 1 కోటి 48 లక్షల రూపాయల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అబ్రహం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటి తహసిల్దార్ నందిని, ఎంపిడిఓ రాఘవ, ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శోభారాణి, సర్పంచ్‌లు జయచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మధునాయుడు, వీరన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యులు గుమ్మ గోవర్ధన్, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు సల్వారెడ్డి, చంద్రగౌడ్, నీలి శ్రీనివాసులు, సుంకన్న, యుగంధర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, సోలన్న, దానం, ఈదన్ననాయుడు పాల్గొన్నారు.



### రైతు శ్రేయస్సు కోసం పని చేస్తున్న
## ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమే..

**అలంపూర్,ఆగస్టు 16 ప్రభాతవార్త :** అలంపూర్ మండలం ఉట్కూర్ గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్స్ ద్వారా నీటిని ఎమ్మెల్యే అబ్రహం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ మైనర్ రిపేర్ మరమ్మతుల కోసం 2.5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. కావున రైతులు సాగునీటిని వృధా చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు లిఫ్ట్ ఛైర్మన్ నర్సగౌడ్, కోనేరు ఉపసర్పంచ్ నరసింహనాయుడు, మాజీమార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ అధ్యక్షుడు మహేష్‌నాయుడు, ర్యాలంపాడు సర్దార్, సర్పంచ్ శ్రీను, రైతులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన అలంపూర్ ఎమ్మెల్యే

**అలంపూర్,ఆగస్టు 16 ప్రభాతవార్త :** వడ్డేపల్లి మండల పరిధిలో 36 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రతి పేదింటి ఆడపిల్ల పిల్లలు భారం కాకూడదన్న ఉద్దేశంతోనే సీఎం కెసిఆర్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. పేదలకు అండగా నిలుస్తుందన్నారు. అలాగే గర్భిణీ సమయంలో అంగన్‌వాడి కేంద్రం ద్వారా పాలు, గుడ్లు, మంచి భోజనాన్ని, పోషకాహార రూపంలో అందజేస్తున్నామని, అలాగే ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకున్న తర్వాత కెసిఆర్ కిట్ అందజేస్తామన్నారు. ఈ పథకం తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కర్ణసూరి, వడ్డేపల్లి జడ్పీటిసి రాజు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప దేవాలయంలో కొనసాగుతున్న పనులు..

**పనులు పరిశీలించిన సర్పంచ్ కోనేటి తిరుపతయ్య**

**లింగాల,ఆగస్టు 16 ప్రభాతవార్త :** దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తుందని సర్పంచ్ కోనేటి తిరుపతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ వీరమణికంఠ అయ్యప్ప దేవాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సర్పంచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కోనేటి తిరుపతయ్య మాట్లాడుతూ అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో దేవాలయ అభివృద్ధి కొరకు రూ. 17 లక్షలు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. దేవాలయం చుట్టు ప్రహరీగోడలు, సిసి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. దేవాలయ నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.



## సిసి ఫుటేజ్‌కి చిక్కిన దొంగలు

**ఛాలెంజ్‌గా తీసుకున్న మక్తల్ సిఐ, ఎస్సై**

**మక్తల్,ఆగస్టు 16 ప్రభాతవార్త :** పట్టణంలోని సాయినగర్ కాలనీలో జరిగిన భారీ చోరీకి సంబంధించిన దొంగల ఆచూకీ సిసి ఫుటేజ్ ద్వారా లభించినట్లు తెలిపారు. దొంగలు పల్సర్ ఎర్రబైక్‌పై ముగురు యువకులు 8 గం.ల సమయంలో సంఘటన జరిగిన ఏరియా నుండి వస్తున్న దృశ్యం సిసి ఫుటేజ్‌లో రికార్డు అయిందని దాని ఆధారంగా పోలీసులు వేట ప్రారంభించారని విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని ఇతరులకు ఎవరికి చెప్పవద్దని పోలీసులు తెలిపినట్లు సమాచారం.

### త్వరలో నియోజకవర్గంలో నడిగడ్డ
## హక్కుల పోరాట సమితి కమిటి ఏర్పాటు

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్**

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 16 ప్రభాతవార్త :** నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో త్వరలో అలంపూర్ నియోజకవర్గంలో చిత్తశుద్ధి గల బహుజన స్వతంత్ర నాయకత్వం కోసం నడిగడ్డ హక్కుల పోరాట సమితి కృషి చేస్తోందని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ తెలిపారు. దశాబ్దాలుగా అగ్రవర్ణాల, పెత్తందారుల కనుసన్నల్లో అలంపూర్ నియోజకవర్గం ఆగమైపోతున్నదని, గతంలో అగ్రవర్ణాల నాయకులు పక్క నియోజకవర్గాల నుండి వచ్చి పరిపాలించారని, రిజర్వ్ అయ్యాక కూడా తమ చేతుల్లో అభ్యర్థులను కీలుబొమ్మలుగా మార్చి నియోజకవర్గం అభివృద్ధి చెందనీయకుండా అడుగు, అడుగునా అడ్డుకున్న పరిస్థితి ఉందని అన్నారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి అలంపూర్ నియోజకవర్గంలో ఉన్న ప్రజా సమస్యలపై పోరాడుతూ రాబోయే రోజుల్లో చిత్తశుద్ధి గల బహుజన నాయకత్వం కోసం కృషి చేస్తుందని అన్నారు. త్వరలో అలంపూర్ నియోజకవర్గంలో పర్యటించి కమిటిని ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ క్రాంతిదళ్ నాయకులు నాగేష్‌యాదవ్, వీరేష్, రాముడు, నాగేష్, పవన్, దొడ్డన్న, గోపాల్ పాల్గొన్నారు.



### ప్రార్థనల పేరిట అక్రమంగా హాస్టల్ విద్యార్థినిలను చర్చిలకు తరలిస్తున్న
# హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

### - హిందూ వాహిని డిమాండ్

**వనపర్తి టౌన్ ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** పట్టణ కేంద్రంలోని బసవన్న గడ్డలోని వెనుకబడిన షెడ్యూల్డ్ కులాల కమ్యూనిటీ బాలికల హాస్టల్ విద్యార్థినిలను అక్రమంగా ప్రార్థనల కోసం చర్చికి పంపిన హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని హిందూ వాహిని జిల్లా శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుశితకు వినతిపత్రం అందజేశారు. హిందూ వాహిని పాలమూరు విభాగ్ కన్వీనర్ అభిలాష్ హౌదేకార్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు ఎంతో కష్టపడుకుంటూ ఉన్నత చదువులు చదివించాలని ఆశతో అధికారులపై ఉన్న నమ్మకంతో ప్రభుత్వ హాస్టల్‌లో ఉంచి చదివిస్తుంటే హాస్టల్ వార్డెన్ మాత్రం విద్యార్థినిల పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించడం ఆమె తీరును హిందూ వాహిని తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వనపర్తి పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఒక ఇంటి అపార్ట్‌మెంట్‌లో కర్నూల్‌కు చెందిన ఒక పాస్టర్ ఇంటి పేరు మీద గత 5 సంవత్సరాల నుండి ఒక రూం అద్దెకు తీసుకుని



వనపర్తి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుశితకు వినతిపత్రం అందజేస్తున్న హిందూ వాహిని నాయకులు

అందులో అనేక మంది అమ్మాయిలను ప్రజలను మోసపూరితమైన మాయ మాటలు చెప్పి సోదరీమణులకు మతం మార్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కొన్ని హాస్టల్‌ల్లో పాస్టర్ వచ్చి మాయ మాటలు చెప్పి ప్రతి ఆదివారం అమ్మాయిలందరినీ అక్కడక్కడ ప్రార్థనలకు పంపడం హేయమైన చర్య అని అన్నారు. హాస్టల్ సెక్యూరిటీని ఎందుకు ఇలా జరిగిందని ప్రశ్నించగా పాస్టర్ హాస్టల్‌లోపలికి వచ్చి ఇష్టం ఉన్న వాళ్ళు రండి మాంసాహారంతో చేసిన వంటలు, ఆటలు, పాటలు ఉంటవి అని మాయ మాటలు చెప్పి తీసుకుని పోవడం జరుగుతుందని బదులిచ్చారు. కావునా ఎవరైతే మతం మార్చుకుని చర్చికిపోతారో వారికి బీసీ డీ సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణలో ఉండవలసిన హాస్టల్ వార్డెన్ , విద్యార్థినీల పట్ల నిర్లక్ష్యం వహించడం ఏమైనా జరగరాని విషయం జరిగితే దానికి బాధ్యులు ఎవరు వహిస్తారని దీనిపై సమగ్ర సర్వే చేసి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ప్రతి హాస్టల్ దగ్గర సీసీ కెమెరాలు అమర్చాలని, ప్రతి రోజు సంబంధిత అధికార పర్యవేక్షణ చేయాలని హిందూ వాహిని జిల్లా శాఖ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా కో కన్వీనర్ అరవింద్, నరేష్, హర్ష, పట్టణ కార్యకర్తలు నంద, శరత్, చరణ్, వినయ్, యువరాజ్ తదితర హిందూ వాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించాలి..

### - జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్

**వనపర్తి టౌన్ ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతి వ్యకినతకి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసే విధంగా గ్రామ, వార్డు స్థాయిలో ప్రచారం చేయించాలని జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుండి కలెక్టర్లు, స్వీప్ నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 18-19 సంవత్సరాల వయసు పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా స్వీప్ యాక్టివిటీ ద్వారా మండల, గ్రామ స్థాయిలో ప్రచారం చేయించాలని సూచించారు. అదేవిధంగా దివ్యాంగులు ట్రాన్స్‌జెండర్స్ ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా చూడాలని అన్నారు. గ్రామ మండల స్థాయిలో ఇంటింటికి వెళ్లి 18-19 సంవత్సరాల వయసు కలిగిన వారు ఎవరైనా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోలేని వారు ఉన్నారా అనేది తెలుసుకునే విధంగా చూడాలని అన్నారు. కళాశాలలో ఓటరు నమోదుపై ప్రచారం చేయాలని, చునావ్ పాఠశాల యటివిటిలు చేయించాలని సూచించారు. పిల్లలకు ఎన్నికల అవగాహన కలిగించే విధంగా ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటికే స్వీప్ యాక్టివిటి ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదుకై వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో స్వీప్ యాక్టివిటీ పెంచడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డీవో పద్మావతి, స్వీప్ నోడల్ అధికారి రమేష్ రెడ్డి, రామ మహేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్ , పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు

### తప్పిపోయిన వ్యక్తులను వారి బంధువులతో
## కలపడానికి దర్పణం ఫేస్ రికగ్నైజేషన్ పోర్టల్..

### - జిల్లా ఐటీ ఎస్ఐ అభిషేక్ రెడ్డి - జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లకు దర్పణం యాప్‌పై శిక్షణ

**వనపర్తి టౌన్ ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** తప్పిపోయిన వ్యక్తులను వారి బంధువులతో కలపడానికి దర్పణం ఫేస్ రికగ్నైజేషన్ పోర్టల్ ఉపయోగపడుతుందని జిల్లా ఐటీ ఎస్ఐ అభిషేక్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆదేశానుసారం బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లకు దర్పణం యాప్ గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఐటీ ఎస్ఐ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ... దర్పణం యాప్ వలన తప్పిపోయిన వ్యక్తులను వారి బంధువుల వద్దకు చేర్చడానికి సహాయ పడుతుందని, తెలంగాణ పోలీసులు అభివృద్ధి చేసిన దర్పణ్ పోర్టల్ ద్వారా దేశంలో ఎక్కడ తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడంలో పోలీసులకు దర్పణం అనే ఫేషియల్ రికగ్నైజేషన్ టూల్ సహాయపడుతుందన్నారు. ఇది పోలీసులకు చాలా సులువుగా ఉంటుందన్నారు. తప్పిపోయిన వ్యక్తుల ఫోటోలను గుర్తు తెలియని శవాలను కూడా మేము సీసీటీఎన్ఎస్ నుండి కూడా డాటాను పొందుతామని, సేకరించిన డాటా నుండి ఫోటోను సరి పోలికను కనుగొన్న వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం పంపబడుతుందని, బంధువులను వెంటనే కలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఎస్ఐ అభిషేక్‌రెడ్డి, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



దర్పణం యాప్‌పై శిక్షణ కల్పిస్తున్న జిల్లా ఐటీ ఎస్ఐ అభిషేక్ రెడ్డి

### పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా
## ఎన్నికైన బచ్చు రాముకు ఘన సన్మానం

**వనపర్తి టౌన్,ఆగస్టు 16, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా అయ్యప్ప సేవా సమితి దేవాలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వనపర్తి పట్టణ బీజేపీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బచ్చు రాము ను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవదాయ కమిటీ అధ్యక్షులు నగేష్, ముత్తుస్వామి , ఎల్బీ చారి , గౌడ్ వెంకన్న చిట్టి దేవాలయ కమిటీ సభ్యులు సన్మానించడంతో బచ్చు రాము ధన్యవాదాలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి నూతనంగా పట్టణ బీజేపీ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా 25వేల చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సీతారాములు,బీజేపీ జిల్లా కార్యదర్శి చిత్తారి ప్రభాకర్, వెంకటేష్, రాఘవేందర్ , విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## చరిత్ర, ప్రపంచ విజ్ఞానం పుస్తక భాండాగారమే..

### - నవ తెలంగాణ పబ్లికేషన్స్ ప్రచురణలు ఏర్పాటు చేయడం సంతోషకరం

### - అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు , మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్

**వనపర్తి టౌన్,ఆగస్టు16, ప్రభాతవార్త:**చరిత్ర, ప్రపంచ విజ్ఞానం పుస్తక భాండాగారమే అని,జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో నవ తెలంగాణ పబ్లికేషన్స్ ప్రచురణలు ఏర్పాటు చేయడం సంతోషకరమని అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీకౌన్సిలర్ సతీష్‌యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మొన్న ఏర్పాటుచేసిన నవ తెలంగాణ పబ్లికేషన్స్ ఏర్పాటు చేసిన స్టాల్కి ఆహ్వానం పంపారని కానీ అందుబాటులో లేక హాజరు కాలేకపోయాయనని , అక్కడికి వెళ్లి వచ్చిన మిత్రులు ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీసభ్యులు నాగరాజుకు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషాకు,వీ6 ఉమ్మడి జిల్లా స్టాఫర్ శ్రీనివాస్ సాగర్ లకు విప్లవ నేత చేగువేర పోరాట సంచికలను బహుమతిగా ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. చరిత్రకారులు, విప్లవ చరయితలు కళాకారులు రచించిన ఈ పుస్తకాలను విద్యార్థులకు , విద్యావంతులకు విజ్ఞానం అందిస్తుందని ప్రతి ఒక్కరు రాజీవ్ చౌక్ లో ఏర్పాటు చేసిన నవ తెలంగాణ స్టాల్‌ను సందర్శించి చరిత్ర, విజ్ఞానాన్ని పొందాలని ఆయన పేర్కొన్నారు.



నవ తెలంగాణ స్టాల్‌ను సందర్శించిన అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

### అమావాస్య సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి
## దేవాలయంలో అన్నదానం చేసిన డిఆర్ శ్రీధర్ కుటుంబం

**ధరూర్,ఆగస్టు 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం అమావాస్యను పురస్కరించుకుని డిఆర్. మంజుల శ్రీధర్ కుటుంబం అన్నదానం చేయడం జరిగింది. ఈ అమావాస్యను పురస్కరించుకుని వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి కుటుంబ సభ్యులు డిఆర్ శ్రీహర్ష, డిఆర్ మంజుల అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా భక్తులు సంతోషం వ్యక్తం చేస్తూ అన్నదాత సుఖీభవ అంటూ హర్షం వ్యక్తం చేశారు.



## 60 ఏళ్లలో సాధించలేని ప్రగతి 9 ఏళ్లలో సాధ్యమైంది..

### - ప్రజా సంక్షేమ ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం

### - భా.రా.స జిల్లా అధికార ప్రతినిధి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్



వనపర్తిటౌన్ ,ఆగస్టు 16, ప్రభాతవార్త: అరవై ఏళ్లల్లో సాధించలేని ప్రగతి 9 ఏళ్లలో కేసీఆర్ నాయకత్వంలో సాధ్యమైందని భా.రా.స జిల్లా అధికార ప్రతినిది, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం అంశంలో దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా గడిచిన 20 రోజుల్లోనే 10 అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్న సీఎం కేసీఆర్ గృహలక్ష్మి లబ్ధిదారులు 4 లక్షలు, నిధులు 12వేల కోట్లు, ఆర్టీసీ విలీనం లబ్ధిదారులు 43,373, రేషన్ డీలర్ల కమిషన్ లబ్ధిదారులు 17,227, నిధులు139 కోట్లు, రైతు రుణమాఫీ లబ్ధిదారులు 29.61, లక్షల నిధులు19,000 కోట్లు, దివ్యాంగుల పెన్షన్ పెంపు లబ్ధిదారులు 5.11,లక్షల నిధులు 600 కోట్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలు లబ్ధిదారులు 7.50, లక్షల నిధులు 2,847 కోట్లు, వీఆర్ఏల క్రమబద్ధీకరణ లబ్ధిదారులు 20,555, పోడు పట్టాల లబ్ధిదారులు 1,51,635 , పంపిణీ 4,06,389 ఎకరాలు, మెట్రో విస్తరణ పొడవు 310 కిలో మీటర్లు, నిధులు 69,100 కోట్లు, పాలమూరు ఎత్తిపోతల 12.30 లక్షల ఎకరాలు , సబ్బండ వర్గాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్న సీఎం కేసీఆర్‌కు , రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆకస్మిక తనిఖీలు చేపట్టిన జిల్లా వ్యవసాయాధికారి

**కృష్ణ,ఆగస్టు 16 ప్రభాతవార్త :** జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ కృష్ణ మండలం, గుడెబల్లూరు గ్రామం టైరోడ్డులోని ఇఫ్కో, ఆగ్రోరైతు సేవా కేంద్రం ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని, అధిక ధరలు విక్రయించినట్లయితే చట్ట ప్రకారం లైసెన్స్ రద్దు చేసి,చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన తరువాత రశీదు తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుత వానాకాలానికి సరిపోయే ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.



## పార్థివ దేహానికి నివాళులర్పించిన
## బీఆర్ఎస్ నాయకులు సురేందర్ రెడ్డి

**వీపనగండ్ల,ఆగస్టు 16, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామంలో పులగూరు నాగమ్మ అనే మహిళా మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎద్దుల సురేందర్ రెడ్డి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి, దహన సంస్కారాల నిమిత్తం తన వంతుగా రూ.5వేలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సింగిల్‌విండో డైరెక్టర్ అప్పరాల నరసింహ, భాస్కర్ రెడ్డి, కోటీశ్వర్ రెడ్డి, వడ్డె తిరుపతయ్య , గాలెన్న, చిన్న రాముడు, తదితర టీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన ఏఎన్ఎంలు..

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 16 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఏఎన్ఎంలు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం దృష్టికి వెంటనే తీసుకువెళ్లి మా సమస్యలను పరిశీలించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులు సమయానికి విధుల్లో ఉండాలి

- మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి


బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్, సర్పంచ్, ఎంపీడీవో

**వీపనగండ్ల ,ఆగస్టు 16, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని కేజీ బీవీ బాలికల పాఠశాల, వసతి గృహం,బీసీ బాలుర విద్యార్థుల వసతి గృహాన్ని స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ...కేజీబీవీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు తగినంతగా మరుగుదొడ్లు లేవని ఈ విషయాన్ని పై అధికారులకు తెలియ జేస్తానని అన్నారు. మిగిలిన నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను వెంటనే పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డిని కోరారు. విద్యార్థుల భవి ష్యత్తు ఉపాధ్యాయుల మీద ఆధారపడి ఉన్నందునఉపాధ్యాయులు పాఠ శాల సమయం తప్పకుండా పాటించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. వసతి గృహాలలో ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందిం చాలని వసతి గృహ సిబ్బందిని కోరారు.అదే విధంగా వసతి గృహాలను,పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగాఉంచుకోవాలని వారు తెలిపారు. విద్యార్థులకు ఏమైనా అనారోగ్యసమస్యలు ఉంటే వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సిబ్బందిని కోరారు. బీసీ బాలుర వసతి గృహంలో హాస్టల్ వార్డెన్ శివయ్య లేనందునతాత్కాలిక వంట ఉద్యోగి నాగయ్యతో మాట్లాడుతూ... విద్యార్థులకు సమయానికి ఆహారం అందించాలని, మెనూ ప్రకారం ఆహారం ఇవ్వాలని ఇదేవిషయాన్ని ఇంచార్జీవార్డెన్ శివయ్యకు ఫోన్‌లో తెలిపారు.అదే విధంగా వర్షాకాలం కావునా విష సర్పాలు సంచరించే అవకాశం ఉన్నందున విద్యార్థులు రాత్రివేళలో జాగ్రత్తగా ఉండాలని వారు సలహాఇచ్చారు.వంట చేసే సిబ్బంది ఆహారం వండేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కథాలప్ప,గ్రామ సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.


వసతి గృహ వంట గదిని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సర్పంచ్

## అయ్యప్ప ఆలయంలో అఖండ దీపారాధన


అయ్యప్పస్వామి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**మూసాపేట,ఆగస్టు 16 ప్రభాతవార్త:** మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్పక్షేత్రంలో అఖండ దీపారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అధిక శ్రావణమాసం ముగింపును పురస్కరించుకుని మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం సంకల్ప సిద్ధి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అఖండ దీపారాధన కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం వినాయక, కుమారస్వామి, అయ్యప్పస్వామి విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామియే శరణమయ్యప్ప నామాలతో అయ్యప్పకొండ మారుమోగింది. పూజలు వచ్చిన భక్తులకు ఆలయ కమిటి తరపున తీర్థ ప్రసాదాలను అందజేశారు.24 గంటలు దీపంఉండేలా ఆలయ కమిటి సభ్యులు అఖండదీపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు ఎన్.తిరుపతయ్యగౌడ్,గౌరవాధ్యక్షులు గుపని కొండయ్య, మిడ్జిల్లా విశ్వేశ్వర్,ప్రధాన కార్యదర్శి జంగంమధు,ఉపాధ్యక్షులు కొంగరి శ్రీనివాసులు,ఆలయ కమిటి సభ్యులు దిగుతిరుపతి, ముక్తానాగేష్, దేవరాజ్, గణేష్, రఘు భక్తులు ఉన్నారు.

## ఘనంగా స్వామివారి కళ్యాణోత్సవం


స్వామివారి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**కెటిదొడ్డి,ఆగస్టు 16 ప్రభాతవార్త:** నడిగడ్డతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఇలవేల్పు, కోరిన కోరికలు తీర్చే పాగుంట శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా స్వామివారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పల్లకిసేవ నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తాదులకు గద్వాల రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్లరాజశేఖర్‌రెడ్డి దంపతులు,మాజీ మార్కెట్ చైర్మన్ బండ్ల లక్ష్మిదేవమ్మ చంద్రశేఖర్‌రెడ్డి,ఆధ్వర్యంలోఅన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు శేషిరెడ్డి, తిమ్మారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జడ్జి


జిల్లా జడ్జికి స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

**కెటిదొడ్డి,ఆగస్టు 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలిసిన శ్రీశ్రీ పాగుంట లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని బుధవారం గద్వాల ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్ జడ్జి కుష సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనకు ఆలయ అర్చకులు, ఆలయ పెద్దలు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చకుల చేత అర్చనలు చేయించి శాలువాతో సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, గ్రామ సర్పంచ్, కెటిదొడ్డి మండల ఎస్సై వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉపాధి పనుల ఆడిట్


ఎంపిడిఓ రాఘవ

**ఇటిక్యాల,ఆగస్టు 16 ప్రభాతవార్త:** మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో వివిధ రకాల పనులు కూలీలు చేపట్టారు. 2021 సెప్టెంబర్ నెలనుండి 2023 మార్చి నెల వరకు సుమారు 9 కోట్ల రూపాయల నిధులతో ఉపాధిహామీ పథకం కింద పనులు నిర్వహించినట్లు ఎంపిడిఓ రాఘవ తెలిపారు. చేసిన పనులకు గ్రామాలలో 3 రోజులుగా పనుల పరిశీలన, కూలీలతో మాట్లాడటం, గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్ని పంచాయతీలలో ఆడిట్ పూర్తి అయితే ఈనెల 25వ తేదీన మండల కేంద్రంలో ప్రజావేదిక కార్యక్రమం కొనసాగుతుందని ఎస్ఆర్పీ సురేంద్ర ఆధ్వర్యంలో గ్రామాలలో డిఆర్పీలు ఆడిట్ చేస్తున్నట్లు ఎంపిడిఓ రాఘవ తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించిన ప్రోగ్రామ్ ఆఫీసర్


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డా. రాజు

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 16 ప్రభాతవార్త:** పిహెచ్‌సి గట్టును సందర్శించి ఎన్‌సిడి కార్నర్ ఏర్పాటు చేశారు. మొదట పేషెంట్ 30 సంవత్సరాలు దాటిన వారు మొదట ఎన్సీడి కార్నర్ దగ్గరికి వచ్చి పరీక్షలు నిర్వహించుకున్న తర్వాత డాక్టర్ దగ్గరికి వెళ్లాలని సూచించారు. అనంతరం బిపి, షుగర్ మందుల డ్రగ్స్ స్టాక్ చెక్‌చేయడం జరిగింది. జిల్లా స్టాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాక్ సబ్ సెంటర్ స్టాక్ అన్ని కూడా టాలీ కావాలని డిపిసి శ్యాంసుందర్ ఫార్మాసిస్టుకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ ఫార్మాసిస్టు శ్వేత పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

**భూత్పూర్,ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఢిల్లీ ముఖ్యమంత్రి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గం ఇంఛార్జి గద్దం ఎల్లప్ప బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రజా సేవయే పరమావధిగా, అవినీతి రహిత పాలన చేస్తున్న కేజ్రీవాల్ మిగిలిన రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని ఎల్లప్ప పేర్కొన్నారు.

# కాంట్రాక్టు ఎఎన్ఎలందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలి

■ లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు


మాట్లాడుతున్న ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండవ ఎఎన్ఎంతో పాటు,ఈసి,ఔట్‌సోర్సింగ్,కాంట్రాక్టు ఎఎన్ఎంలందరిని ఎలాంటి షరతులు లేకుండా బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండవ ఏఎన్ఎంతో పాటు ఇతర ఏఎన్ఎంలందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రాజీవ్ మార్గ్‌ఎస్టీఓ కార్యాలయంపక్కన నిరవధిక సమ్మెను ఆంజనేయులు ప్రారంభించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి చాలీ చాలని వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలాంటి పథకాలైన ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలోనూ ప్రతిరోజు 30రకాల పనులు నిర్విరామంగా కొనసాగిస్తున్న వారు శ్రమ దోపిడికి గురవుతున్నరని అన్నారు. గత అనేక సంవత్సరాల నుంచి ఏఐటియుసి ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్ఎంతో పాటు ఈసి, ఔట్‌సోర్సింగ్, అర్బన్,104తో పాటు వివిధ రకాల ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పోరాటాలు చేశామని అయినా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం వెంటనేస్పందించి అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కోశాధికారి ఆశన్న, 2వ ఎఎన్ఎంఅధ్యక్షురాలు పద్మ, జ్యోతి, ఈసి ఏఎన్ఎంలు నవీనా, దానమ్మ, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు సువర్ణ, మర్త, రేణుక, కవిత, మహేశ్వరి, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పేద ప్రజలకు వరం

● అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహం


కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అబ్రహం

**ఉండవెల్లి, ఆగస్టు16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని 33 మంది లబ్దిదారులకు రూ. 3,303,828ల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లలు పెళ్లి వయస్సు వచ్చిన తర్వాత ఆడపిల్లలకు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటానని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ రూపంలో మొదలు 50 వేల నుంచి నేడు లక్షనూట పదహారు రూపాయలు అందజేసి ఇవ్వడం జరిగింది. ఆడపడుచులకు పెద్దన్నగా నిలిచారు. పెళ్లి సమయంలో ఒకవేళ అప్పు చేసిన అప్పులు తీర్చి ధైర్యం తల్లిదండ్రులకు ఇచ్చిఅండగా నిలిచిన నాయకుడు కెసిఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ రూపంలోవారిని ఆదుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరికి సంతోషంగా, సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరిక అని తెలిపారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలి

- పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్



**అమరచింత,ఆగస్టు16, ప్రభాతవార్త:** రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డిలపై పెట్టిన అక్రమ కేసును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ భయపడి పోలీసులచే కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులపై ఎన్ని కేసులుపెట్టిన భయపడరని ఆయన అన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వానికి అనుకూలంగా కొందరు పోలీసులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులు ప్రభుత్వానికి వత్తాసు పలకడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.ఇప్పటికైనా పోలీసులు తమతీరును మార్చుకోవాలనిరాష్ట్రంలో కాంగ్రెసనపార్టీ అధికారంలోకి వస్తుందని పోలీ సులు గుర్తుంచుకోవాలని వారిని కోరారు. ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన జైలుకు పంపిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భయపడరని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సంపత్ కుమార్,వంశీచందర్‌రెడ్డిలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఖిల్లాలో బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో బస్తీ బాట


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**ఖిల్లాఘణపురం,ఆగస్టు16, ప్రభాతవార్త:** బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రజా సమస్యలపై , డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు చేతి వృత్తులకు లక్ష రూపాయలు ఇవ్వకపోవడాన్ని నింసిస్తు బుధవారం మండల పరిధిలోని షాపూర్ గ్రామంలో బస్తిబాట పల్లె బాట పేరుతో గ్రామ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు నవీన్‌రెడ్డి ప్రజలతో మాట్లాడుతూ.... కేసీఆర్ ప్రజలను మోస పూరిత వాగ్దానాలు చేస్తున్నారని దళితబంధు అంటు తెలంగాణలో మొత్తం దళితులను,బీసీ బందు అంటు బీసీలనుడబుల్ బెడ్ రూమ్స్ అంటూ రాష్ట్రవ్యాప్తంగా పచ్చి అబద్దాలు గ్రామాలలో ప్రజలకు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.కేంద్ర పథకాలను కూడా ప్రజలకు వివరిస్తు డబల్ ఇంజన్ సర్కారును తెలంగాణలో ప్రజలు కోరుతున్నారని, రాబోయే శాసనసభ ఎన్నికలలో బీజేపీ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబు గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆశన్న, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ,బూత్ అధ్యక్షులు సామల,రమేష్ కుంబం, రమేష్, షాపూర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరాలయంలో అన్నదానం

**మక్తల్,ఆగస్టు 16 ప్రభాతవార్త:** పట్టణంలోని ఆజాద్ నగర్‌లో వెలసిన శ్రీ ఉమామహేశ్వరాలయంలో అమావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి తెల్లవారు జామున 4.30 గం.లకు మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని పలువురు భక్తులు స్వామివారికి అభిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం ప్రారంభం కానుండడంతో పెద్ద ఎత్తున భక్తులు శ్రీ ఉమామహేశ్వరులకు అబిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకునిఅమావాస్య వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, భజన కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం1 గం.లకు మహా మంగళహారతి, అనంతరం అన్నదానకర్తలుగా సోయర్ కోవర్‌బాబుసింగ్ దంపతులు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిద్ది రామయ్యస్వామి, ఆలయ కమిటి సభ్యులు బి.ఆంజనేయులు, సూర్య, చిన్న కృష్ణయ్య, పోలేపల్లి అనంతకుమార్, బి. శ్రీనివాసులు, నారాయణరెడ్డి, తిప్పిరెడ్డి, అభిలాష్, పెద్దబోయవెంకటేష్, చిన్నవెంకటేష్, వాకిటి అంజయ్య, కరణ్, బి.నాగరాజు, పాపిరెడ్డి, గడిగండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

## ఉచితంగా గాంధీ చిత్ర ప్రదర్శన

-5483 మంది విద్యార్థుల వీక్షణ...


సినిమాను వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** గాంధీ సినిమాను అన్ని పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రజలు ఉచితంగా వీక్షించేలా జిల్లాలో 7 టాకీస్‌లను ఎంపిక చేసి ప్రదర్శించారని, ఈ నెల 24వ తేదీ వరకు ఆయా థియేటర్లలో ప్రదర్శన ఉంటుందని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. గాంధీ సినిమాను అన్ని పాఠశాలల విద్యార్థులు వీక్షించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో రామకృష్ణ థియేటర్లలో గాంధీ చిత్రాన్ని జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆయన వీక్షించారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాల్లోని థియేటర్లలోరోజుకు 5483 మంది విద్యార్థులు బుధవారం సినిమాను వీక్షించారు.ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉచితంగా చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. రానున్న వారం రోజుల్లో అందరు విద్యార్థులు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులను ఆయన ఆదేశించారు.

## జిల్లా వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేసిన ఏఎన్ఎంలు


జిల్లా వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఎన్ఎంలు

**వనపర్తి వైద్య విభాగం,ఆగస్టు16, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాకు చెందిన రెండవ ఏఎన్ఎంలు బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, కొత్తగా ఏఎన్ఎంల భర్తీకి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌రద్దు చేయాలన్న డిమాండ్లతో రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా తాము కూడా సమ్మెకు వెళ్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. డిమాండ్లు నెరవేరేదాకా సమ్మెకొనసాగిస్తామని నోటీసులో తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి,లక్ష్మమ్మ, లావణ్య,నాగలక్ష్మి, సుమిత్ర, మహేశ్వరి , సబిత, విజయలక్ష్మి,రాధిక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతునికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి,ఆగస్టు 16 ప్రభాతవార్త:** కృష్ణా మండలం తులసి గ్రామానికి చెందిన ఎరుకలి బసవరాజు మాగనూరు మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. గత మూడు రోజుల క్రితం మండల కేంద్రంలో పని నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణం వెళ్తున్న సందర్భంలో అనుకోకుండా బైక్‌పై నుంచి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి.ఆసుపత్రికి తీసుకువెళ్లి రెండు రోజులు చికిత్స అందించారు.అయినా కోలేకోలేదు.మంగళవారం రాత్రి తుదిశ్వాస విడి చారు.ఇది తెలుసుకున్న సహోదర మిత్రబృందం పూర్వ విద్యార్థులందరు కలిసి ఆ గ్రామానికి వెళ్లిఘనంగా నివాళులర్పించారుఅనంతరంపూర్వ విద్యార్థులందరు కలిసి ఆ కుటుంబానికి 41 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## నర్సింగాపూర్‌లో బిజెపి బస్తీబాట


నర్సింగాపూర్‌లో బస్తీబాట నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

**భూత్పూర్,ఆగస్టు 16 ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాపూర్ బిజెపి నాయకులు బుధవారం బస్తీబాట నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింగాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణం పనులు నత్తనడకను సాగుతున్నాయని, అసంపూర్తి పనులతో కాలయాపన జరుగుతుందని నాయకులు సుదర్శన్‌రెడ్డి,రవిందర్,హరినాథ్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, సదానందం, పట్నం శ్రీను తదితరులు అన్నారు.

## ఘనంగా అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి


మాజీ ప్రధాని అటల్‌జీకి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

**భూత్పూర్,ఆగస్టు 16 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పేయి 6వ వర్ధంతిని బుధవారం భూత్పూర్‌లో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. భూత్పూర్ చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బిజెపిలో మచ్చలేని నేతగా స్వర్గీయ వాజ్‌పేయి ఎదిగారని బిజెపి రాష్ట్ర నాయకుడు వి. సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.రెండుమార్లు ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలందించారని కొనియాడారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు రవిందర్,ఫరూక్,ప్రశాంత్‌రెడ్డి, హరినాథ్‌గౌడ్, పట్నం శ్రీను, సదానంద్, రాజగోపాల్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

## తెలంగాణ గణిత ఫోరం జిల్లా నూతన కమిటీ ఎంపిక

**వనపర్తి టౌన్,ఆగస్టు16, ప్రభాతవార్త:** తెలంగాణ గణితఫోరం ఉపాధ్యాయుల జిల్లా నూతన కమిటీ ఎన్నికైనట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణంలో వనపర్తి జిల్లాలో గణిత ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు.గణిత ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.అనంతరం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా గణిత ఫోరం గౌరవ అధ్యక్షులు మద్దిలేటి, కమిటీ సలహాదారులు రాములు తెలిపారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షులుగా విజయ్ కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాందాపూర్, ఉపాధ్యక్షులుగా పుల్యా నాయక్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా రాజవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా పాండురంగ, కార్యవర్గ సభ్యులుగా బాలస్వామి, సతీష్ కుమార్, కేశవులు , మోహన్ బాబు, కృష్ణయ్య ఎంపిక అయినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుమాట్లాడుతూ...జిల్లాలో ఉన్న గణిత ఉపాధ్యాయులు సమస్యలపై స్పందించి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

పీబీఎస్ వృద్ధాశ్రమంలో హ్యూమానిటీ సొసైటీ ఆధ్వర్యంలో

## వృద్ధులకు బెడ్స్, స్వెటర్స్ పండ్లు పంపిణీ

**కల్వకుర్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పీబీఎస్ వృద్దాశ్రమంలో హ్యూమానిటీ సోసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు బెడ్స్, స్వెటర్స్, పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హ్యూమానిటీ సోసైటీ సభ్యులు జి.రమేష్ ఆధ్వర్యంలో హాజరై వృద్ధులకు బెడ్స్, స్వెటర్స్,పండ్లను అందించారు.ఈ సందర్భంగా హ్యూమానిటీ సోసైటీ సభ్యులు జి.రమేష్ మాట్లాడుతూ నిరాధరణకు గురైన వృద్ధులను చేరదీసి ఆశ్రమం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.వెంకటయ్యను సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హ్యూమానిటీ సోసైటీ సభ్యులు ఫిరోజ్, బంగారి, ఆంజనేయులు, శ్రావణ్, దేవ ప్రసన్నకుమార్, ఫయిమ్, రమేష్, నసీర్ ఉన్నారు.


వృద్ధులకు బెడ్స్, స్వెటర్స్ అందజేస్తున్న దృశ్యం

## నవోదయ ధరఖాస్తు గడువు మరో మారు పొడిగింపు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశం కొరకు ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తుల గడువును పరిపాలన కారణాల రీత్యా ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లాలోని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ కోరారు. నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోరేటటువంటి అభ్యర్థులు ప్రస్తుతం 5వ తరగతి ఉమ్మడి జిల్లాలోనే చదువుతూ ఉండి అభ్యర్థుల తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి జిల్లాలోని వారై ఉండాలి...ఆసక్తిగల అభ్యర్థులు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా లైదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగానే ధరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు గాను ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడినధృవపత్రం, ఫోటోతో ధరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. ఈ నెల 25వ తేదీ చివరి అని, ఉమ్మడి జిల్లా లోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మేలొ్కని తమ తమ పిల్లలను ప్రోత్సహించి అధిక సంఖ్యలో ధరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ ధరఖాస్తులో కులం, లింగం, ప్రాంతం, మీడియం మరియు వైకల్యం వివరాల్లో తప్పులుంటే సవరించుకునేందుకు చివరి తేదీ ముగిసిన అనంతరం 2 రోజులు ఆన్‌లైన్ మార్పులు కూడా ఉంటాయన్నారు.

## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి నమోదు చేసుకోవాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ మరియు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఈ నెల 25న లోగా సంబంధిత మండల విద్యాధికారి ప్రతిపాదనలు పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు 15సంవత్సరాల సర్వీస్,ఉపాధ్యాయులకు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి ఉండాలన్నారు. మరిన్ని వివరములకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డిని సంప్రదించాలన్నారు. తదుపరి వచ్చిన ప్రతిపాదనలు స్వీకరించబడనని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా..

**-కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పరామర్శిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగస్టు16 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామలో పార్టీ కార్యకర్తలైన 16 కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహయం అందించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో కా ంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.కార్యక్రమంలో ఎల్లికల్ ఎంపీటీసీ సభ్యులు నర్మద నరసింహరెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ కల్లు భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు అనిల్‌గౌడ్, నాయకులు బాలరాజు, వెంకటయ్య, శివకృష్ణ, యాదయ్య,శ్రీను,బాలస్వామి,ఆనంద్‌కుమార్, కృపాకర్‌రెడ్డి, కోట్ల మల్లేష్, వంశి, శివ, శ్రీకాంత్, మల్లేష్ ఉన్నారు.

## ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



**భూత్పూర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఢిల్లీ ముఖ్యమంత్రి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీ వాల్ 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గం ఇంఛార్జి గడ్డం ఎల్లప్ప బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రజా సేవయే పరమావధిగా, అవినీతి రహితపాలన చేస్తున్న కేజ్రీవాల్ మిగిలిన రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని ఎల్లప్ప పేర్కొన్నారు.

## గిరిజనులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

**- 9వ వార్డు కౌన్సిలర్ చైతన్య చౌహాన్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు16, ప్రభాతవార్త:** తెలంగాణలో అధికారంలోకి రాగానే ఎస్టీల వర్గీకరణ చేస్తామని చెప్పిన టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, గిరిజనులకు 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని జడ్చర్ల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చైతన్య చౌహాన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజనులకు అవమాన పరిచేవిధంగా వారిలో విబేధాలు సృష్టించే విధంగా అహంకార పద్ధతిలో గిరిజనుల్లోనూ వర్గీకరణ చేపడుతామని, రిజర్వేషన్ సిస్టంను మారుస్తామని అనడం ఆయన అవివేకానికి నిదర్శనమని తక్షణమే గిరిజనులకు క్షమాపణ చెప్పాలని,తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే తెలంగాణలో అడ్డుకుంటామని హెచ్చరించారు.

## గాంధీ చిత్రాన్ని తిలకించిన 4197 మంది విద్యార్థులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు16, ప్రభాతవార్త:** గాంధీ చిత్రాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని థియేటర్లలో 4197 మంది విద్యార్థులు తిలకించినట్లు విద్యాశాఖాధికారి రవీందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గాంధీ చిత్ర ప్రదర్శనను జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్రలోని 8 థియేటర్లలో 14, 16వ తేదీల్లో ప్రదర్శనను విద్యార్థులు తిలకించినట్లు పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు వందశాతం విద్యార్థులు సినిమాను తిలకించారని చెప్పారు.

## బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలిని కలిసిన చింతకుంట యువత

**కెటిదొడ్డి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మను పార్టీ కార్యాలయంలో బుధవారం కెటిదొడ్డి మండలం చింతకుంట గ్రామ బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కెటిదొడ్డి మండలం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని యువకులు కోరారు. బిజెపి పార్టీ పటిష్టతకు శాయశక్తులా కృషి చేస్తున్నామని, క్యాడర్‌లో, గ్రామ గ్రామాల్లో పార్టీ పట్ల ఆత్మవిశ్వాసం పెంచి చాలా బలంగా మారుస్తున్నామని యువకులు చెప్పడం జరిగిందన్నారు. 2024లో పార్టీ గెలుపు కోసం జాతీయ రాష్ట్ర పెద్దల సహకారంతో మరింత ఉత్సాహంగా పని చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో చింతకుంట గ్రామ యువకులు పాల్గొన్నారు.



బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణను సన్మానిస్తున్న చింతకుంట యువత

# ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రచారం చేయాలి

**● గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకునేలా పకడ్బందీగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం హైద్రాబాద్ నుండి రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన విడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్‌లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాస్‌లతో కలిసి సమీకృత కలెక్టరేట్ విడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. మన రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ టర్న్ అవుట్ పెంపుకు తీసుకోవాల్సిన చర్యలు, నూతన ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి, జనాభా ఓటర్ల నిష్పత్తి తదితర అంశాలపై రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ జిల్లా కలెక్టర్‌లకు పలు సూచనలు చేశారు. నూతనంగా మంజూరు చేసిన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు ముద్రించి అందించాలని, నూతనంగా నమోదైన ఓటర్లు, ముద్రించిన ఓటరు గుర్తింపు కార్డులు, పంపిణీ చేసిన కార్డులపై నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల వారిగా జనాభా ఓటర్ల నిష్పత్తి, లింగ నిష్పత్తి, ఓటర్లలో యువ ఓటర్ల నిష్పత్తిపై సమాచారం అందించాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేర జనాభా, ఓటర్ నిష్పత్తి ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థలలో ప్రత్యేక ఎలక్టోరల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని, ఓటరు ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం కల్పించాలని 18 సంత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఓటరు నమోదు అంశంలో లింగ నిష్పత్తి తక్కువ కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి నూతన మహిళా ఓటర్లు నమోదు విస్తృతంగా జరిగేలా చూడాలని అన్నారు. రెండవ విడత ఓటరు జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్టు ఓటరు జాబితా విడుదల కంటే ముందు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని, రెండవ ఓటరు సవరణ షెడ్యూల్ పై సమాచారం అందించాలని, ఆగస్టు 21న విడుదల చేస్తామని, సెప్టెంబర్ 19లోపు అభ్యంతరాలు,నూతన ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఆగస్టు 15 నాటికి నమోదైన ఓటర్లు గుర్తింపు కార్డు త్వరగా ముద్రణ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రింటర్లతో సమన్వయం చేసుకుని త్వరగా పంపిణీ చేసేలా చూడాలని అన్నారు. సమావేశంలో ఇడి ఎస్సీ కార్పోరేషన్ రమేష్‌బాబు, కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ నరేష్, సురేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, హాజరైన కలెక్టర్

# సీజనల్ వ్యాధులను నివారించేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలి

**● వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ● పెబ్బేరు మున్సిపాలిటీ ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**వనపర్తి వైద్య విభాగం, ఆగస్టు16, ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులను నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖల సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఉదయం పెబ్బేరు మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం,కస్తూర్బా గాంధీపాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ సీజనల్ వ్యాధులను నివారించేందుకు అవసరమైన మందులు ఉన్నాయా? లేవా అని స్టాక్ రిజిస్టర్ ద్వారా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన వారు ఎలాంటి రోగాలతో ఎక్కువ మంది వస్తున్నారోవివరాలు సేకరించారు.రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు.అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. చేపట్టిన అభివృద్ధి పనులు పారిశుద్ధ్య కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ...దోమలు విపరీతంగా పెరిగాయని వాటిని నివారించడానికి ప్రజలకు అవగాహన కల్పించాలని మురుగునీరు ఎక్కడ ఆగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి అయ్యేవిధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్నిసందర్శించారు.ధరణి,రిజిస్ట్రేషన్ పనులను సమీక్షించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పరిసరాల పరిశుభ్రత, వంటకాలను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి హిందీ అభ్యసన సామర్థ్యాలనుపరిశీలించారు.విద్యార్థులను నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# మా విజయం బ్లాక్‌మెయిలర్లకు చెంపపెట్టు

**- అఫిడవిట్ కేసులో విజయం సాధించిన చైర్మన్, కౌన్సిలర్లు**
**- ఇదే విజయం మంత్రి కేసులోనూ వస్తుంది: మున్సిపల్ చైర్మన్ నర్సింహులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు16, ప్రభాతవార్త:** ప్రజాక్షేత్రంలో ప్రజాబలంతో ఎన్నికల్లో గెలవలేని వారు గెలిచిన వారి విజయాన్ని జీర్ణించుకోలేక ఒర్వలేక కుట్రలతో తప్పుడు కేసులు వేసి చివరికి అబాసుపాలు అవుతున్నారని మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు అన్నారు. తమపై 2020లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసి ఎన్నికల్లో గెలిచినట్లు కాంగ్రెస్ నాయకుడు రాఘవేంద్రరాజు వేసిన కేసులో తాము విజయం సాధించామని తెలిపారు. ఈ మేరకు మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో వార్డు పరిధిలోని తాను, 21వ వార్డు పరిధిలోని ఆనంద్ కుమార్,10వ వార్డు ఎం రాణి, 29వ వార్డు మహబూబ్ అలీ, 33వ వార్డు మహ్మద్ మునిరుద్దీన్ బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికల్లో గెలిచినట్లు చైర్మన్ నర్సింహులు తెలిపారు.తమ ఐదుగురిపై తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారంటూ వేసిన కేసులో తాము విజయం సాధించామని వివరించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి ప్రధాత మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై వేసిన అఫిడవిట్ కేసులోనూ అంతిమ విజయం తమదేనని ఆశాభావం వ్యక్తం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కేసీ నర్సింహులు

**మాపై అఫిడవిట్ ఉందని ఎక్కడా చెప్పలేదు: ఆనంద్‌కుమార్‌గౌడ్**

ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ సమర్పించినట్లు ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకుడు రాఘవేంద్రరాజు తనపై కోర్టులో వేసిన కేసులో తాము విజయం సాధించినట్లు 21వ వార్డు కౌన్సిలర్ ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇవాలా వచ్చిన ఫలితం తప్పుడు కేసులు వేసే వారికి చెంపపెట్టు సమాధానమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ సెల్ నాయకుడు విక్రమ్‌దేవ్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్, నలుగురు కౌన్సిలర్లపై తప్పుడు అఫిడవిట్ అని వేసిన కేసులో నిరాధారమైన ఆరోపణలు ఉన్నాయని కోర్టు కేసు కొట్టివేసిందని తెలిపారు. ఎన్ని దుర్మార్గపు చర్యలకు పాల్పడినా తమకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, అందుకే అంతిమ విజయం సాధించామన్నారు.అనంతరం చైర్మన్, కౌన్సిలర్లు మిఠాయిలు తినిపించుకున్నారు.

## గోవిందా.. గోవిందా.. కురుమూర్తి వాసా గోవిందా!

**చిన్నచింతకుంట, ఆగస్టు 16 ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడి ప్రతిరూపంగా కొలువబడుతూ,పల్లె ప్రజలఆరాధ్య దైవంగా, పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి కొండకు భక్తులు పోటెత్తారు. బుధవారం శ్రావణమాస అమావాస్య కావడంతో పల్లె ప్రాంతాల నుంచే కాకుండా పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే స్వామివారి కొండకు చేరుకుని కొండ దిగువ నుంచి ప్రధాన మెట్లపై బారులు తీరి గోవిందా గోవిందా కురుమూర్తి వాస గోవిందా అంటూ భక్తుల గోవింద నామస్మరణతో కురుమతి గిరులు పులకరించాయి. స్వామివారి ప్రధానాలయంలో మూలవిరాట్ శ్రీ వెంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీలక్ష్మీదేవి అమ్మవార్లు, శ్రీచెన్నకేశవస్వామి, ఉద్దాలమండపంలోని స్వామివారి పాదుకలను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పల్లె ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు స్వామివారి మొక్కులో భాగంగా మెట్టు మెట్టుకు కొబ్బరికాయ కొట్టి భక్తులు స్వామివారి మొక్కులను తీర్చుకున్నారు. కొండ దిగువన దాతల సహకారంతో భక్తలకు ఉచిత అన్నదానం చేశారు.

**వాహనాల పార్కింగ్‌తో భక్తుల అవస్థలు:** జాతర మైదానలో ఇష్టారీతిలో భక్తులు తమ ద్విచక్ర వాహనాలను నిలిపి వేయడంతో సాధారణ భక్తజనం ఇబ్బందులు పడ్డారు.ద్విచక్ర వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో భక్తులు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.ద్విచక్ర వాహనాల పార్కింగ్‌పై దేవస్థాన అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

## సిసి కుంటకు జూనియర్ కళాశాల మంజూరు

**చిన్నచింతకుంట, ఆగస్టు 16 ప్రభాతవార్త:** మండల ప్రజల చిరకాల కోరికను స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కృషితో కెసిఆర్ ప్రభుత్వం నెరవేర్చింది. మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిఓను జారీ చేసింది. సిసి కుంట మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ జారీ చేయడం పట్ల స్థానిక ఎమ్మెల్యే ఆల ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఈ ప్రాంత ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని పేద విద్యార్థుల ఉన్నత విద్యకై సుదూర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే కళాశాల చదువుకు దూరమవుతున్నారు.పేద విద్యార్థులకళను కెసిఆర్ ప్రభుత్వం నెరవేర్చడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేసిన సందర్భంగా నేడు ఉదయం 10 గం.లకు మండల కేంద్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి సబితా ఇంద్రారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## భూత్పూర్ సిపిఎస్‌లో యునాని వైద్య శిబిరం




10వ వార్డులోని సిపిఎస్‌లో యునాని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా. జహీరొద్దిన్

**భూత్పూర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ప్రభుత్వ యునాని భూత్పూర్ ఆధ్వర్యంలో యునాని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యునాని స్పెషలిస్టు డా. జహీరొద్దిన్, సిపిఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత యునాని మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా. జహీరుద్దిన్‌తో పాటు పిటిఎఫ్ సాబేర్ పాల్గొన్నారు.

## అన్నసాగర్‌లో నేటినుంచి శ్రీఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు

**భూత్పూర్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం ఎమ్మెల్యే స్వగ్రామం అన్నసాగర్‌లో శ్రీ ఆంజనేయస్వామి దేవస్థాన పునర్నిర్మాణంలో భాగంగా ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ, పూజ కార్యక్రమాలు ఈనెల 17,18,19 తేదీలలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలు రోజుకో ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. 17వ తేదీ గురువారం గణపతి పూజ, పుణ్యహవచన, రక్షాబంధనం, పంచగవ్య ప్రశనం, యాగశాల ప్రవేశం, పర్యగ్నికరణం,నవగ్రహ వాస్తుపూజ, సర్వతోభద్ర మండలిపూజ, అంకురార్పణ, యోగిని దేవతాపూజ, జాదివాసం, అగ్రిప్రతిష్ఠ, మహా మంగళహారతి, 18వ తేదీ మూలమంత్ర వాహనాలు, రుద్రపారాయణం, వేద పారాయణం, మంగళహారతితో సాయంత్రం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చివరి రోజు 19వ తేదీ శనివారం ప్రతిష్ఠ హోమాలు, మహాస్నాపనం, యంత్ర ప్రతిష్ఠ, నాభిలాషి (బొడ్రాయి) ప్రతిష్ఠ, దేవత ప్రతిష్ఠ, కక్షజ్వల, దెనుధర్మన, దర్పణ దర్శనం, మహాబలి, పూర్ణాహుతి, మంగళహారతి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలు తిలకించేందుకు గ్రామస్తులతో పాటు నియోజవర్గం ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, భూత్పూర్ మండల నాయకులు, అభిమానులు వేల సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు.



అన్నాసాగర్‌లో పునర్నిర్మించిన శ్రీఆంజనేయస్వామి దేవాలయం

## బీజేపీ ఆధ్వర్యంలో బస్తీ బాట

**ఖిల్లాఘణపురం, ఆగస్టు16, ప్రభాతవార్త:** బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేర కు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రజా సమస్యలపై ,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు చేతి వృత్తులకు లక్ష రూపాయలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తు బుధవారం మండల పరిధిలోని షాపూర్ గ్రామంలో బస్తిబాట పల్లె బాట పేరుతో గ్రామ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు నవీన్‌రెడ్డి ప్రజలతో మాట్లాడుతూ.... కేసీఆర్ ప్రజలను మోస పూరిత వాగ్ధానాలు చేస్తున్నారని దళితబంధు అంటు తెలంగాణలో మొత్తం దళితులను,బీసీ బందు అంటు బీసీలనుడబుల్ బెడ్ రూమ్స్ అంటూ రాష్ట్రవ్యాప్తంగా పచ్చి అబద్దాలు గ్రామాలలో ప్రజలకు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.కేంద్ర పథకాలను కూడా ప్రజలకు వివరిస్తు డబల్ ఇంజన్ సర్కారును తెలంగాణలో ప్రజలు కోరుతున్నారని, రాబోయే శాసన సభ ఎన్నికలలో బీజేపీ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబు గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆశన్న, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ,బూత్‌అధ్యక్షులు సామల,రమేష్ కుంబం, రమేష్, షాపూర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

**● ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు**

**చిన్నచింతకుంట, ఆగస్టు 16 ప్రభాతవార్త:** అజాగ్రత్తగా తమ ద్విచక్ర వాహనాన్ని నడిపి రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసి బస్సును ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి, ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం మధ్యాహ్నం 3 గం.లకు అమ్మాపూర్, దుప్పల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై ఆర్. శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన తెలుగు సాయికుమార్ (30), హరిజన రమేష్ (24) హరిజన్ గోపాల్ ముగ్గురు కలిసి తమ గ్రామానికి వస్తుండగా అజాగ్రత్తగా వేగంగా తమ వాహనాన్ని నడుపుతూ శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం నుంచి వనపర్తికి వెళ్తున్న టిఎస్ 06 జడ్0178 నంబర్ గల ఆర్టీసి బస్సు అమ్మాపూర్ సమీపంలో గల కొన్నూరు ఎక్స్‌రోడ్డు వద్దకు రాగానే కొన్నూరు నుంచి వస్తున్న టివిఎస్ ఎక్సెల్ వాహనం ఆర్టీసి బస్సు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు వ్యక్తుల్లో తెలుగు సాయికుమార్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. హరిజన్ మహేష్‌ను ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందారని ఎస్సై తెలిపారు. స్వల్ప గాయాలతో హరిజన గోపాల్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాన్ని నడపడంతోనే రోడ్డు ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు.





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్, హరిజన మహేష్